



EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
బుధవారం
21-05-2025
పేజీలు: 02


## ఐపీఎల్‌లో నేడు



ముంబై VS ఢిల్లీ
ముంబై,
రాత్రి:7.30

స్టార్ స్పోర్ట్స్,
జియో హాట్‌స్టార్‌లో..



## ఐపీఎల్ పాయింట్ల పట్టిక

| టీమ్ | మ్యాచ్‌లు | విన్ | లాస్ | పాయింట్స్ |
|---|---|---|---|---|
| గుజరాత్(Q) | 12 | 9 | 3 | 18 |
| ఆర్సీబీ (Q) | 12 | 8 | 3 | 17 |
| పంజాబ్ (Q) | 12 | 8 | 3 | 17 |
| ముంబై | 12 | 7 | 4 | 14 |
| ఢిల్లీ | 12 | 6 | 5 | 13 |
| కోల్‌కతా | 13 | 5 | 6 | 12 |
| లక్నో | 12 | 5 | 7 | 10 |
| సన్‌రైజర్స్ | 12 | 4 | 7 | 9 |
| రాజస్తాన్ | 14 | 4 | 10 | 8 |
| చెన్నై | 13 | 3 | 10 | 6 |



ఆరెంజ్ క్యాప్
617
ఐపీఎల్
అత్యధిక రన్స్



పర్పుల్ క్యాప్
21
ఐపీఎల్
అత్యధిక వికెట్స్



## శంషాబాద్ విమానాశ్రయంలో పెను ప్రమాదం తప్పింది

హైదరాబాద్‌లోని శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఫ్రాంక్‌ఫోర్ట్‌కు బయల్దేరాల్సిన విమానంలో సాంకేతిక లోపం ఏర్పడింది. రన్‌వే మీదకు వెళ్లిన వెంటనే విమానం ముందు టైరులో సాంకేతిక సమస్య కనుగొనబడింది. సమస్యను తక్షణమే గుర్తించిన పైలట్ అప్రమత్తంగా వ్యవహరించి, విమానాన్ని వెనక్కి మళ్లించారు. ఈ చర్యతో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటన సమయంలో విమానంలో 190 మంది ప్రయాణీకులు ఉన్నారు. పైలట్ తన చురుకైన నిర్ణయంతో ప్రయాణీకుల ప్రాణాలను కాపాడారు. విమానాశ్రయ అధికారులు సాంకేతిక సమస్యను సరిచేసేందుకు చర్యలు చేపట్టారు. ప్రయాణీకులు సురక్షితంగా ఉన్నారని, తదుపరి ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. పైలట్ సమయస్ఫూర్తితో ప్రమాదం నివారణ అయిన ఈ సంఘటన ప్రయాణీకులను ఊపిరి పీల్చుకునేలా చేసింది.

## మహారాష్ట్రలో వందకుపైగా కొవిడ్ కేసులు నమోదు



ఈ ఏడాది జనవరి నుంచివందకుపైగా పాజిటివ్ కేసులు

దక్షిణాసియాలో కొవిడ్-19 మళ్లీ విజృంభిస్తోంది. భారత్‌లోనూ కరోనా వైరస్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం దేశంలో 257 యాక్టివ్ కేసులు నమోదైనట్లు ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. అయితే, మరణాలు కూడా సంభవిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి మహారాష్ట్రలో ఏకంగా వందకుపైగా పాజిటివ్ కేసులు నిర్ధారణ అయినట్లు ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. మొత్తం 6,066 స్వాబ్ టెస్టులు చేయగా 106 కేసులు పాజిటివ్‌గా తేలినట్లు చెప్పారు. అందులో కేవలం 101 మంది ముంబైకి చెందిన వారే ఉండటం గమనార్హం. మిగిలిన వారు థానే, పూణె, కొల్హాపూర్‌కు చెందిన వారుగా పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 52 పాజిటివ్ కేసులు ఉన్నట్లు వెల్లడించారు. వీరిలో 16 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. జనవరి నుంచి రెండు కొవిడ్ సంబంధిత మరణాలు కూడా నమోదైనట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంగళవారం తెలిపింది. మరణించిన వారిలో ఒకరు క్యాన్సర్ రోగి అని పేర్కొంది. దేశంలో కొవిడ్ పరిస్థితి నియంత్రణలో ఉందని, ఆందోళన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించిన విషయం తెలిసిందే. మరోవైపు పరిస్థితిని జాగ్రత్తగా పర్యవేక్షిస్తున్నామని తెలిపింది. జలుబు, దగ్గుతో బాధపడుతున్న రోగులతోపాటు ఊపిరితిత్తుల వ్యాధులకు సంబంధించిన రోగుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని దవాఖానలను ఆదేశించింది.

## తుఫాన్‌ని ఏ పిడుగూ ఆపలేదు!

రెండుగంటల పాటు వినోదాన్ని పంచేందుకు కొన్ని నెలల పాటు చమటోరుస్తారు సినిమావాళ్లు. ఈ క్రమంలో ఒక్కోసారి ప్రాణాలమీదకు కూడా తెచ్చుకుంటారు. అందుకే వారి కష్టాన్ని తక్కువచేసి చూడలేం. రీసెంట్‌గా ఢిల్లీ భామ రాశీఖన్నా ఓ షూటింగ్‌లో గాయలపాలైంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ తన సోషల్ మీడియాలో ఫొటోలను కూడా షేర్ చేసింది. ఈ ఫొటోల్లో ఆమె చేతికీ, ముఖానికి చిన్న చిన్న దెబ్బలు కనిపిస్తున్నాయి.'కథ డిమాండ్ చేస్తే.. గాయాలను కూడా లెక్క చేయకూడదు.. మనమే ఒక తుఫాన్ అయినప్పుడు, మనల్ని ఏ పిడుగూ ఆపలేదు..' అంటూ ఫొటోలతో పాటు ఓ క్యాప్షన్‌ని కూడా జతచేసింది రాశీఖన్నా. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో బాగా వైరల్ అవతున్నది. ఈ ముద్దుగుమ్మ షాహిద్‌కపూర్‌తో కలిసి నటించిన వెబ్ సిరీస్ 'ఫర్జీ'. విజయ్ సేతుపతి కీలక పాత్ర పోషించిన ఈ వెబ్ సిరీస్ ఓటీటీలో పెద్ద హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం ఈ సిరీస్‌కి సంబంధించిన సీజన్2 షూటింగ్ మొదలైనట్టు సమాచారం.



## శ్రేయాస్ అయ్యర్ ఎక్కడికెళ్లినా సూపర్ హిట్టు



ఐపీఎల్ పుట్టినప్పట్నుంచి (2008) లీగ్‌లో భాగంగా ఉన్న పంజాబ్ కింగ్స్ (గతంలో కింగ్స్ లెవన్ పంజాబ్) గత సీజన్ దాకా నిలకడలేమికి బ్రాండ్ అంబాసిడర్. ఈ లీగ్‌లో ఆ జట్టు మార్చినంత మంది సారథులను మరే జట్టూ మార్చలేదనేది కండ్ల ముందు కనబడుతున్న వాస్తవం. దాదాపు సీజన్‌కు ఒకరు.. ఒక్కోసారి ఇద్దరి (ఇప్పటిదాకా 17 మంది కెప్టెన్లు ఆ జట్టుకు కెప్టెన్లుగా పనిచేశారు) చొప్పున ఆ జట్టు పగ్గాలు చేపట్టినా కింగ్స్ రాతను మార్చలేకపోయారు. టైటిల్ సంగతి దేవుడెరుగు! కనీసం ప్లేఆఫ్స్‌కు వెళ్లిన సందర్భాలూ రెండంటే రెండే. 2008లో మూడో స్థానంతో ముగించిన ఆ జట్టు.. 2014లో టైటిల్ కలను నెరవేర్చుకునేందుకు అవకాశమొచ్చినా తుది మెట్టుపై బోల్తా కొట్టింది. ఆ తర్వాత 11 ఏండ్ల సుదీర్ఘ విరామం అనంతరం మళ్లీ పంజాబ్ ప్లేఆఫ్స్‌లోకి అడుగుపెట్టడమే గాక టైటిల్ ఫేవరెట్లలో ఒకటిగా దూసుకుపోతుంది. అన్నింటికి మించి గతంతో పోల్చితే ఈ సీజన్‌లో ఆ జట్టు ఆటతీరు పూర్తిగా మారింది. పంజాబ్ ఈ స్థాయిలో మారడానికి కారణం సారథి శ్రేయాస్ అయ్యర్. ఆ జట్టు అభిమానులు 'సర్పంచ్ సాబ్'గా పిలుచుకుంటున్న శ్రేయాస్.. హెడ్‌కోచ్ రికీ పాంటింగ్‌తో కలిసి కింగ్స్ గతినీ, గమనాన్నీ పూర్తిగా మార్చేశాడు.వ్యక్తిగత రికార్డులను పక్కనబెట్టి మరీ జట్టు కోసం ఓ సెంచరీనీ త్యాగం చేశాడు. ఈ సీజన్‌లో పంజాబ్ ఆడిన తొలి మ్యాచ్‌లో 97★ రన్స్ చేసి శతకానికి దగ్గరగా వచ్చినా మరో ఎండ్‌లో శశాంక్ సింగ్ బాదుతుంటే నాన్‌స్ట్రైకర్ ఎండ్‌లో ఉండి అతడిని ప్రోత్సహించాడు. సారథి ఇచ్చిన స్ఫూర్తితో పంజాబ్ బ్యాటర్లూ ఫియర్‌లెస్ అప్రోచ్, అటాకింగ్ బ్యాటింగ్‌తో దుమ్మురేపుతున్నారు. ప్రియాన్ష్, ప్రభ్‌సిమ్రన్, శశాంక్, నెహల్ వంటి కుర్రాళ్ల మెరుపులే ఇందుకు నిదర్శనం.ఇక కోల్‌కతాతో ముల్లాన్‌పూర్‌లో జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ 111 పరుగులకే కుప్పకూలినా తన బౌలర్లపై నమ్మకంతో శ్రేయాస్ తనదైన వ్యూహాలతో మ్యాచ్‌ను కాపాడుకున్నాడు. ఈ సీజన్‌లో అప్పటి దాకా నిరాశపరిచిన యుజ్వేంద్ర చాహల్‌తో వరుస ఓవర్లు వేయించి ఫలితాన్ని రాబట్టాడు. ప్రత్యర్థి జట్ల బ్యాటర్లు క్రీజులో కుదురుకోనీయకుండా బౌలింగ్ మార్పులు చేస్తూ పంజాబ్‌ను విజయవంతంగా నడిపిస్తున్నాడు. మొన్న ముగిసిన రాజస్థాన్‌తో మ్యాచ్‌లో వేలునొప్పితో ఫీల్డింగ్‌కు రాకపోయినా బౌండరీ లైన్ వద్ద అటూఇటూ తిరుగుతూ స్టాండ్ ఇన్ కెప్టెన్ శశాంక్‌కు బంతిబంతికీ సలహాలు అందించాడు. ఇదే ఊపులో శ్రేయాస్.. పంజాబ్ టైటిల్ కల నెరవేరిస్తే భవిష్యత్‌లో టీమ్‌ఇండియా పరిమిత ఓవర్ల జట్టు సారథ్య రేసులోనూ నిలుస్తాడనంలో అతిశయోక్తి లేదు.

## మిరాయ్ కొత్త షెడ్యూల్ స్టార్ట్



'హను-మాన్' చిత్రంతో పాన్ ఇండియా స్టార్‌గా మారాడు యంగ్ హీరో తేజ సజ్జా. ఇక ఆ సినిమా ఇచ్చిన బూస్ట్‌తో ఇప్పుడు వరుసగా సినిమాలు చేస్తూ దూసుకెళ్తున్నాడు. అయితే, ప్రస్తుతం మరో పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీ 'మిరాయ్'లో నటిస్తున్నాడు ఈ హీరో. ఇప్పటికే శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా నుంచి తాజాగా ఓ ఇంట్రెస్టింగ్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ సినిమా కొత్త షెడ్యూల్‌ని ముంబైలోని హిస్టారికల్ గుహల్లో చిత్రీకరిస్తున్నారు. తేజ సజ్జాతో పాటు ఈ షూటింగ్‌లో పలువురు నటీనటులు నటిస్తున్నారు. ఇక్కడ కొన్ని కీలక సన్నివేశాలు చిత్రీకరించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. అయితే, ఈ సినిమాలో బ్లాక్ స్వార్డ్ అనే నెగిటివ్ పాత్రలో రాకింగ్ స్టార్ మంచు మనోజ్ నటిస్తున్నాడు. ఇప్పటికే వీరికి సంబంధించిన పోస్టర్స్ ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేశాయి. ఇక ఈ సినిమాను కార్తీక్ ఘట్టమనేని డైరెక్ట్ చేస్తుండగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టి.జి.విశ్వప్రసాద్ ప్రొడ్యూస్ చేస్తున్నారు. గౌర హరి సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తోంది.

## భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్లు



భారతస్టాక్‌మార్కెట్లునేడులాభాలతో మొదలై,క్రమంగాపుంజుకున్నాయి. దీంతోనిన్నటిభారీనష్టాలనుంచి మార్కెట్ రికవరీఅయ్యిందని చెప్పవచ్చు. ఈక్రమంలోఉదయం 10.36గంటలనాటికిబీఎస్ఈసెన్సెక్స్ 800పాయింట్లులాభపడగా, NSEనిఫ్టీ 251పాయింట్లుఎకబాకింది. ఇదే సమయంలోబ్యాంక్‌నిఫ్టీ457పాయింట్లువృద్ధిచెందగా, నిఫ్టీమిడ్‌క్యాప్100సూచీ మాత్రం532పాయింట్లుపైకిచేరింది. ఈక్రమంలోమదుపర్లుకొన్నినిమిషాల వ్యవధిలోనేలక్షలకోట్లరూపాయలనుదక్కించుకున్నారు. మరికొంతమంది ఇన్వెస్టర్లుమాత్రంనష్టపోయారు.ఈనేపథ్యంలోప్రస్తుతంభారత్‌ఎలక్ట్రికల్స్, బజాజ్ ఆటో, సన్‌ఫార్మా, సిప్లా, ఎంఅండ్‌ఎంకంపెనీలస్టాక్స్‌టాప్5లాభాల్లోఉండగా, శ్రీరామ్‌ఫైనాన్స్, ఇండస్‌ఇండ్‌బ్యాంక్, కోటక్‌మహీంద్రా, ఎటర్నల్‌కంపెనీలస్టాక్స్ టాప్4నష్టాల్లోఉన్నాయి.


## జూన్ మొదటి వారం నుంచి దరఖాస్తుల పరిశీలన




తెలంగాణ ప్రజలు రేషన్ కార్డుల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. ఈక్రమంలో కాంగ్రెస్ సర్కార్.. రేషన్ కార్డుల మంజూరుకు రెడీ అయ్యింది. ఇప్పటికే ప్రజాపాలన ద్వారా కొత్త రేషన్ కార్డులకోసం దరఖాస్తులు తీసుకుంది. ఈక్రమంలో రేషన్‌కార్డులపై ప్రభుత్వం కీలక అప్డేట్ వెల్లడించింది. జూన్ మొదటి వారం నుంచే ఆ పని ప్రారంభించేందుకు రెడీ అయ్యింది. ఆ వివరాలు..ఇప్పటికి చాలా మంది కొత్త రేషన్‌కార్డుల కోసం అప్లై చేసుకుంటూనే ఉన్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారు.. కొత్త కార్డుల మంజూరు ఎప్పటి నుంచి ఉంటుందా అని ఎదురుచూస్తున్నారు. ఇంకా దరఖాస్తుల పరిశీలన కూడా మొదలుకాకపోవడంతో జనాలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో దీనిపై కీలక అప్డేట్ వెలుగులోకి వచ్చింది. జూన్ మొదటి వారంలో.. హైదరాబాద్‌కు సంబంధించిన కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తుల వెరిఫికేషన్ మొదలుపెట్టనున్నట్టు పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారి ఒకరు స్పష్టం చేశారు. పెద్ద ఎత్తున అప్లై చేస్తుండటంతో.. పరిశీలనకు అడ్డంకిగా మారిందన్నారు.ప్రస్తుతం హైదరాబాద్ నగరంలోని తొమ్మిది సర్కిళ్ల పరిధిలో మొత్తం 6,39,451 రేషన్‌కార్డులున్నాయి. తాజాగా దాదాపు 4 లక్షల వరకు కొత్తగా రేషన్‌కార్డుల కోసం అప్లై చేసుకున్నారు. అయితే చాలా మంది 2, 3సార్లు దరఖాస్తు చేసుకుంటున్నారని అధికారులు తెలిపారు. బల్దియా, కలెక్టరేట్ ప్రజావాణితో పాటు, ఈసేవ ద్వారా ఇంకా అప్లై చేస్తూనే ఉన్నారని వెల్లడించారు. లక్షల్లో ఉన్న దరఖాస్తులను పరిశీలించడానికి.. ప్రస్తుతం సీఆర్ఓ పరిధిలో సరిపడా సిబ్బంది లేరని అధికారులు వెల్లడించారు.

## బిల్డింగ్ పైనుండి దూకిన తల్లి

బంగారం చోరీ అవడంతో మనస్తాపానికి గురై రెండున్నరేళ్ల కుమారుడితో బిల్డింగ్ పైనుండి దూకిన తల్లి. హైదరాబాద్ - చింతల్‌కుంటకు చెందిన సుధేష్ణ (28) ఈ నెల 16న బంధువుల శుభకార్యానికి వెళ్లగా, తన ఏడు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. అవి దొరకకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన సుధేష్ణ.. తన రెండున్నరేళ్ల కుమారుడు ఆరుష్ కుమార్‌తో పాటు మూడో అంతస్తు నుంచి కిందకు దూకింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సుధేష్ణ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా.. బాబు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.




## అహ్మదాబాద్‌లోనే ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్



ఐపీఎల్-18 సీజన్‌లో నాకౌట్ మ్యాచ్‌ల వేదికలు మారాయి. పాత షెడ్యూల్ ప్రకారం హైదరాబాద్, కోల్‌కతా ప్లేఆఫ్స్ మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వాల్సి ఉండగా.. తాజాగా వాటిని ముల్లాన్‌పూర్ (చండీగఢ్), అహ్మదాబాద్‌కు మార్చారు. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం టైటిల్ పోరుకు ఆతిథ్యమివ్వనుంది. ఈ మేరకు బీసీసీఐ మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. హైదరాబాద్‌లో జరగాల్సిన క్వాలిఫయర్ 1, ఎలిమినేటర్ మ్యాచ్‌లను మే 29, 30న ముల్లాన్‌పూర్ (చండీగఢ్) లోని న్యూపీసీఏ స్టేడియంలో నిర్వహించనున్నారు. జూన్ 01న క్వాలిఫయర్-2, 03న అహ్మదాబాద్‌లో ఫైనల్ జరుగుతుంది. ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ నిరాశజనక ప్రదర్శనతో డీలాపడ్డ హైదరాబాద్ అభిమానులు.. నాకౌట్ మ్యాచ్‌లను అయినా వీక్షిద్దామని భావించినా వారికి నిరాశే ఎదురైంది. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో దక్షిణ భారతంలో మ్యాచ్‌లను పూర్తిగా ఉత్తర భారతానికి తరలించారు. నాకౌట్ మ్యాచ్‌లతో పాటు సన్‌రైజర్స్, బెంగళూరు మధ్య ఈనెల 23నమ్యాచ్‌నూ లక్నోకు తరలించినట్టు బీసీసీఐ తెలిపింది.

నేటి దినపత్రిక సూర్య EVENING EDITION 4PM
www.suryaa.com



# బికినీలో కియారా అద్వానీ

బాలీవుడ్ నటుడు హృతిక్ రోషన్, టాలీవుడ్ అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం వార్ 2. ఈ సినిమాకు బ్రహ్మాస్త్ర దర్శకుడు అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నాడు. నేడు ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా వార్ 2 టీజర్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈరోజు ఉదయం విడుదలైన ఈ టీజర్ మిలియన్స్ వ్యూస్‌తో దూసుకుపోతుంది. అయితే ఈ టీజర్ వైరలవ్వడానికి మరో ముఖ్య కారణం ఇందులో నటి కియారా అద్వానీ బికినీలో నటించడం. బికినీలో కియారా మొదటిసారి కనిపించడంతో ప్రస్తుతం సోషల్ మీడియా అంతటా ట్రెండింగ్‌గా మారింది. మరోవైపు వార్ 2 టీజర్‌పై స్పెషల్ పోస్ట్ పెట్టింది కియారా. ఈ సినిమా తన కెరీర్‌లో అనేక మొదటి అనుభవాలను అందించిందని కియారా అద్వానీ పంచుకుంది. యష్ రాజ్ ఫిలింస్‌తో ఇది తన మొదటి సినిమా అని, అలాగే తన మొదటి యాక్షన్ సినిమా అని ఆమె పేర్కొంది. హృతిక్ రోషన్ మరియు జూనియర్ ఎన్టీఆర్ వంటి గొప్ప నటులతో, దర్శకుడు అయాన్ ముఖర్జీతో కలిసి పనిచేయడం కూడా ఇదే తొలిసారి అని కియారా వెల్లడించింది. అన్నింటికీ మించి, టీజర్‌లో తాను బికినీలో కనిపించడం కూడా ఇదే తొలిసారి అని కియారా చెప్పడం విశేషం.



# నిధి అగర్వాల్ టైం ఆగయా

ఇస్మార్ట్ శంకర్ సినిమాతో సూపర్ హిట్టందుకుంది నిధి అగర్వాల్. ఆ తర్వాత పలు సినిమాల్లో నటించినా ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయాయి. ఈ బ్యూటీ ప్రస్తుతం రెండు భారీ పాన్ ఇండియా ప్రాజెక్టుల్లో నటిస్తుందని తెలిసిందే. వీటిలో ఒకటి పవన్ కల్యాణ్ నటిస్తోన్న హరిహరవీరమల్లు కాగా.. మరోవైపు ప్రభాస్ టైటిల్ రోల్ పోషిస్తున్న రాజాసాబ్.ముందుగా అనుకున్న షెడ్యూల్స్ ప్రకారం ఈ సినిమాలు ఇప్పటికే ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉండగా.. పలు కారణాల వల్ల వాయిదా పడుతూ వస్తున్నాయి. ఇక ఈ రెండు ప్రాజెక్టులపై పూర్తి ఆశలు పెట్టుకున్న నిధి అగర్వాల్‌కు వరుస వాయిదాలు నిరాశనే మిగులుస్తూ వస్తున్నాయి. హరిహరవీరమల్లు రీషెడ్యూల్ చేయడంతో నిధి అగర్వాల్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న టైం రానే వచ్చింది. ఫైనల్‌గా నిధి అగర్వాల్ సినిమా ప్రమోషన్స్ మొదలుపెట్టేసింది.

# కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను



రాజకీయ కక్షతోనే కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీయడానికి కాళేశ్వరం కమిషన్ పేరుతో నోటీసులు ఇచ్చారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణంగా తీర్చిదిద్దడానికి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టుకు రూపకల్పన చేశారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు మీద కాంగ్రెస్ పార్టీ వాళ్లకు మొదటి నుంచి కడుపు మంటగా ఉందని, తెలంగాణ బాగుపడటం, పేదలు బాగుపడటం కాంగ్రెస్ పార్టీకి ఎప్పుడూ ఇష్టం ఉండదన్నారు. ప్రజలు ఎప్పటికీ పేదరికంలో ఉంటేనే తమకు పదవులు వస్తాయని భావించే నాయకత్వం కాంగ్రెస్ పార్టీది అని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు మీద కాంగ్రెస్ పార్టీ నాయకులు మొదటి నుంచి కుట్రలు పన్నుతూ అనేక కేసులు వేశారని గుర్తు చేశారు. అదే కుట్రలో భాగంగా అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని రోజుల ముందు కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీకి పగుళ్లు రావడం.. ఆ వెనువెంటనే కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎన్‌డీఎస్ఏ అధికారులు పడవల్లో వచ్చి ఫొటోలు తీసి ప్రచారం చేశారన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాళేశ్వరం ప్రాజెక్టు పై ప్రజలందరినీ కన్ఫ్యూజన్ కు గురి చేశారని అన్నారు. ఈ కుట్రలో భాగంగానే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత కాళేశ్వరం కమిషన్ ను ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దడానికి తన జీవితాన్ని పణంగా పెట్టిన కేసీఆర్ పై కాంగ్రెస్ చేస్తోన్న కుట్రల్లో భాగంగానే కేసీఆర్ కు నోటీసులు అందజేశారని అన్నారు. దీంతో అది కాళేశ్వరం కమిషన్ కాదని... కాంగ్రెస్ కమిషన్ అని మరోసారి తేటతెల్లమైందన్నారు. తెలంగాణ ఏర్పాటు కోసం, ప్రజల కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా భావించి ఆమరణ నిరాహార దీక్ష చేసిన నాయకుడు కేసీఆర్ అని అన్నారు. కేసీఆర్ గారి ప్రతిష్టను, ఆయన పేరును దెబ్బతీయాలనే కుట్రలో భాగంగానే కాంగ్రెస్ పార్టీ ఇలాంటి కమిషన్లు ఏర్పాటు చేసిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ ప్రజల కోసం నిర్మించిన ప్రాజెక్టు అన్న విషయం గుర్తించాలన్నారు. రాజకీయ కుట్రతో, కక్షతో వేసిన ఇలాంటి కమిషన్లు కాలక్రమంలో తప్పకుండా న్యాయాన్నే గెలిపిస్తాయని విశ్వాసం ఉందని ధీమా వ్యక్తం చేశారు. త్వరలోనే నిజాలన్ని బయటకు వస్తాయని పాలు ఏవో.. నీళ్లు ఏవో ప్రజలకు స్పష్టత వస్తుందని ఎమ్మెల్సీ కవిత అన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం.. ఆరుగురు మృతి

కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, కారు బలంగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. బుధవారం ఉదయం విజయపుర జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకుంది. సోలాపూర్ వైపు వెళ్తున్న మహీంద్ర ఎస్‌యూవీ కారు బసవనబాగేవాడి తాలూకాలోని మనగులి పట్టణం సమీపంలోకి రాగానే అదుపుతప్పి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును ఢీ కొట్టింది. దీంతో బస్సు అదుపుతప్పి ఓ కంటైనర్ ట్రక్కుపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారులోని ఐదుగురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. బస్సు డ్రైవర్ కూడా మరణించాడు. ఈ ప్రమాదంలో పలువురు ప్రయాణికులు కూడా గాయాలపాలయ్యారు. ప్రమాద సమాచారం అందుకున్న మనగులి పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

# కాళేశ్వరం నోటీసులపై స్పందించిన బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీష్, ఈటలకు పీసీ ఘోష్ కమిషన్ మంగళవారం నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే అ నోటీసులపై మాజీ మంత్రి, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. తనకు ఇంకా ఎలాంటి నోటీసులు అందలేదన్న ఈటల.. నోటీసులకు భయపడేది లేదన్నారు. తాను ఆర్థిక శాఖమంత్రిగా ఉన్న సమయంలో ఆ శాఖ కార్యదర్శిగా ఉన్న రామకృష్ణారావు ప్రస్తుత రాష్ట్ర సీఎస్ గా ఉన్నారని చెప్పారు. పీసీ కమిషన్ ను ఎందుకు ఇన్నిసార్లు పొడిగించారో చెప్పాలని ఈటల డిమాండ్ చేశారు. తనతో మంత్రులుగా పనిచేసిన వాళ్లంతా ప్రస్తుతం కాంగ్రెస్ లో ఉన్నారని చెప్పారు. తుమ్మల, కడియం, జూపల్లికి ఏం జరిగిందో తెలియదా అని ఈటల ప్రశ్నించారు. కాగా జూన్ 5న విచారణకు రావాలని కేసీఆర్‌కు, జూన్ 6 హరీష్ రావు, జూన్ 9న ఈటెల రాజేందర్‌ను విచారణకు రావాలని పీసీ కమిషన్ జారీ చేసిన నోటీసుల్లో స్పషం చేసింది. వాస్తవానికి ఈ వారంలోనే ప్రభుత్వానికి పీసీ ఘోష్ కమిషన్ రిపోర్టును సమర్పించాల్సి ఉంది. అయితే కేసీఆర్, హరీష్, ఈటల స్టేట్‌మెంట్లు లేకుండా రిపోర్ట్ ఇస్తే లీగల్ సమస్యలు వచ్చే అవకాశం



ఉండడంతో.. వారిని కూడా విచారించాకే రిపోర్టు ఇవ్వాలని కమిషన్ నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. కాగా మేడిగడ్డ బ్యారేజీ కుంగిన ఘటనపై ఇప్పటిదాకా 109 మంది అధికారులు, ప్రైవేట్‌వ్యక్తులను కాళేశ్వరం జ్యుడీషియల్ కమిషన్ విచారించింది.

# స్కూల్ పరీక్షలు ఎంత కష్టమో అసెంబ్లీలో సమాధానాలు ఇవ్వడమూ అంతే కష్టమేనన్న మంత్రి లోకేశ్



పాఠశాల రోజుల్లో తాను లాస్ట్ బెంచ్ విద్యార్థినని, అల్లరి బ్యాచ్‌లో ఉండేవాడినని మంత్రి నారా లోకేశ్ విద్యార్థుల వద్ద చెప్పుకొచ్చారు. షైనింగ్ స్టార్స్ పేరుతో పదో తరగతిలో టాపర్లుగా నిలిచిన 47 మంది విద్యార్థులను మంగళవారం ఉండవల్లిలోని నివాసంలో ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖులు రచించిన తొమ్మిది రకాల పుస్తకాలను వారికి కానుకగా బహుకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి లోకేశ్ సరదాగా సమాధానాలు ఇచ్చారు. మీరు చదువుకునే సమయంలో పాఠశాలలో పరీక్షలు కష్టంగా ఉండేవో, ఇప్పుడు అసెంబ్లీలో సభ్యులు అడిగే ప్రశ్నలు కష్టంగా ఉన్నాయో అని సంతోష్ అనే విద్యార్థి ప్రశ్నించగా, రెండూ కష్టమైనవేనని అన్నారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో వచ్చిన మూడు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చేందుకు ఎంతో ప్రిపేర్ కావాల్సి వచ్చిందన్నారు.మీరు అదృష్టాన్ని నమ్ముతారా, లేక కష్టాన్ని నమ్ముతారా అని మరో విద్యార్థి ప్రశ్నించగా, ఉన్నత స్థానాలకు ఎదగాలంటే కష్టానికి మించిన ప్రత్యామ్నాయం లేదని అన్నారు.

# ఉగ్రలింకుల కేసులో ఎన్ఐఏ దూకుడు




ఉగ్ర లింకుల కేసులో దర్యాప్తు ఏజెఎన్సీల దూకుడు కొనసాగుతోంది. సిరాజ్ కుటుంబసభ్యుల కదలికలపై దర్యాప్తు సంస్థలు గట్టి నిఘా ఉంచాయి. సిరాజ్ బ్యాంక్ ఖాతాల్లో భారీగా నగదును గుర్తించారు. కేసు నేపథ్యంలో సిరాజ్ బ్యాంక్ ఖాతాలను సీజ్ చేశారు. అయితే డీసీసీబీ బ్యాంక్‌లో ఉన్న లాకరు తెరిచేందుకు సిరాజ్ తండ్రి విఫలయత్నం చేసినట్లు తెలుస్తోంది. ఖాతాను సీజ్ చేయడంతో లాకర్ తెరవటానికి కుదరదని సిరాజ్ తండ్రికి బ్యాంక్ అధికారులు తేల్చి చెప్పారు. ఈ విషయంపై రెండు రోజుల పాటు బ్యాంక్ అధికారులను సిరాజ్ తండ్రి కలిసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఏఎస్ఐగా పని చేస్తున్న సిరాజ్ తండ్రితో పాటు కుటుంబ సభ్యుల కదలికలపై దర్యాప్తు సంస్థలు మరింత నిఘా పెట్టాయి. సిరాజ్‌కు ఉగ్ర లింకులతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణల నేపథ్యంలో నమోదైన కేసుపై విజయనగరంలో ఎన్ఐఏ విస్తృతమైన దర్యాప్తును నిర్వహిస్తోంది. గత మూడు రోజులుగా దర్యాప్తు కొనసాగుతోంది. సిరాజ్‌కు చెందిన డీసీసీబీ బ్యాంక్ ఖాతాలో భారీగా నగదు జమ అయినట్లు నిర్ధారణకు వచ్చింది ఎన్ఐఏ. సిరాజ్ తండ్రి పేరుతో డీసీసీబీలో ఓ లాకర్ ఉంది. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతున్న దశలో సిరాజ్ తండ్రి బ్యాంక్ తాలూకా లాకర్‌ను తెరిచేందుకు చాలా ప్రయత్నం చేసినప్పటికీ అది కుదరదని, సీజ్ చేయడం జరిగిందని బ్యాంక్ అధికారులు స్పష్టం చేశారు. ఈ ఖాతాలో సుమారు రూ.42 లక్షల వరకు నగదు జమ అయినట్టు గుర్తించారు. సిరాజ్ తండ్రి ఏఎస్ఐగా పనిచేస్తుండగా.. సిరాజ్ సోదరుడు కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. దీంతో వీరి కదలికలపై దర్యాప్తు సంస్థలు పూర్తి స్థాయిలో నిఘా పెట్టాయి.

# బోరుగడ్డ అనిల్‌ను వరుసగా కేసులు చుట్టుముడుతున్నాయి



వైసీపీ నాయకుడు, రౌడీ షీటర్ బోరుగడ్డ అనిల్‌ను వరుసగా కేసులు చుట్టుముడుతున్నాయి. ఒకదాని తర్వాత మరొకటి అన్నట్లుగా పలు కేసుల్లో అనిల్ నిందితుడిగా ఉండటంతో పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో తాజాగా బోరుగడ్డ అనిల్‌కు గుంటూరు నాలుగో కోర్టు న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు.తన స్థలానికి సంబంధించిన సర్టిఫికెట్ ఇవ్వాలంటూ పెదకాకాని మండల సర్వేయర్ మల్లికార్జునరావును 2016 మే 9న అనిల్ బెదిరించాడు. అప్పట్లో సర్వేయర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసులో అనిల్ గత ఎనిమిది సంవత్సరాలుగా కోర్టు వాయిదాలకు హాజరు కాలేదు.దీంతో అతనికి నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయింది. ఈ నేపథ్యంలో అనంతపురం జైలులో ఉన్న అనిల్‌ను మంగళవారం పీటీ వారెంట్‌పై పోలీసులు గుంటూరు తీసుకువచ్చారు. గుంటూరు ఆరవ కోర్టు మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చాల్సి ఉండగా, ఆ మెజిస్ట్రేట్ సెలవులో ఉండటంతో ఇన్‌చార్జి అయిన నాలుగో కోర్టు మెజిస్ట్రేట్ శోభారాణి ఎదుట హాజరుపరిచారు. వాదనలు విన్న కోర్టు అనిల్‌కు వచ్చే నెల 3వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తీర్పునిచ్చింది. దీంతో పోలీసులు అనిల్‌ను రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. మరోపక్క అనిల్ బెయిల్ పిటిషన్ ను నరసరావుపేట రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం గాయత్రి మంగళవారం డిస్మిస్ చేశారు. ఫిరంగిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో మార్చి 24న పోలీసులు ఆయన్ను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

# హయత్‌నగర్‌లో ఘోర ప్రమాదం.. ముగ్గురు మృతి

హయత్‌నగర్ పరిధిలోని కుంట్లూరులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కుంట్లూరులోని నారాయణ కాలేజీ సమీపంలో తెల్లవారుజామున 5.45 గంటలకు డీసీఎం, కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే ముగ్గురు మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అతి వేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు తేల్చారు.మృతులను పిన్నింటి చంద్రసేన రెడ్డి(24), చుంచు త్రినాథ్ రెడ్డి(24), చుంచు వర్షిత్ రెడ్డి(23)గా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడు అలిమేటి పవన్ కల్యాణ్(24)ను చికిత్స నిమిత్తం హయత్‌నగర్‌లోని సన్‌రైజ్ ఆస్పత్రికి తరలించారు. వీరంతా కుంట్లూరు వాసులే. ఈ నలుగురు కూడా విద్యార్థులే. స్కోడా కారులో (MH-02-DG-0771) పాసుమాముల గ్రామం నుంచి కుంట్లూరు వైపు వస్తున్నారు. డీసీఎం వ్యాన్(TS-07-UK-2664) కుంట్లూరు నుంచి పాసుమాముల వైపు వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

